సాక్షి
వనపర్తి
గురువారం : 24 : అక్టోబర్ : 2024



కొత్త ఉల్లి రాకతో..

దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌కు కొత్త ఉల్లి వస్తుండటంతో ధరలు తగ్గుముఖం పట్టాయి.

వివరాలు 8లో ▸



'డబుల్' దడ

డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపుపై విచారణ పక్కాగా కొనసాగుతోంది.

వివరాలు 8లో ▸



వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. రాత్రి వేళ చలి తీవ్రత కాస్త ఉంటుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి రూరల్: ప్రభుత్వ వైద్య కళాశాల, ఆస్పత్రిలో 2024–25 విద్యా సంవత్సరానికిగాను పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సునందిని బుధవారం ఒక ప్రకటనలో కోరారు. డిప్లొమా ఇన్ అనస్తీషియా టెక్నీషియన్‌లో 30 సీట్లు, డిప్లొమా ఇన్ ఈసీజీ టెక్నీషియన్‌లో 30 సీట్లు భర్తీ చేయనున్నట్లు.. ఇంటర్ బైపీసీ ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. బైపీసీ విద్యార్థులు అందుబాటులో లేకుంటే ఇతర గ్రూపుల వారికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. దరఖాస్తుకు ఈ నెల 30 వరకు అవకాశం ఉందని.. మరిన్ని వివరాలకు కళాశాల వెబ్‌సైట్ http://www.gmcwanaparthy.org/ను సందర్శించాలని సూచించారు.

గవర్నర్‌ను కలిసిన వీసీ



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ జీఎన్ శ్రీనివాస్ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వం రాష్ట్రంలోని 9 యూనివర్సిటీలకు నూతన వీసీలను నియమించిన నేపథ్యంలో వీసీలందరూ బుధవారం గవర్నర్‌ను కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు వీసీ శ్రీనివాస్ పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ యూనివర్సిటీల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలని, వీసీలు సమన్వయంతో పనిచేసి విద్యాభివృద్ధికి పాటుపడాలని సూచించారు.

పేదలకు ఉచిత న్యాయసేవలు



వనపర్తిటౌన్: వార్షిక ఆదాయం రూ.3 లక్షల్లోపు ఉన్న పేదలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు న్యాయ సేవాధికార సంస్థ ఉచితంగా న్యాయ సేవలు అందిస్తోందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజని అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని మండల మహిళా సమాఖ్యలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలను మానసికంగా, శారీరకంగా, ఆర్థికంగా హింసిస్తే న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చని తెలిపారు. వరకట్నం కోసం వేధిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అసిస్టెంట్ లీగల్ హెడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం.శ్రీదేవి వయోవృద్ధుల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సఖి కేంద్రం లీగల్ అడ్వైజర్ డేగల కృష్ణయ్య, చెన్నమ్మ, శారదమ్మ, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట విద్యార్థుల ఆందోళన



వనపర్తి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రియింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలు చెల్లించకపోవడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఇన్‌చార్జ్ రమేష్, జిల్లా అధ్యక్షుడు నరేష్ విమర్శించారు. బుధవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కళాశాల విద్యార్థులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. మొదట కొత్త బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట వారితో పాటు ఏఐటీయూసీ జిల్లా నేతలు శ్రీరామ్, గోపాలకృష్ణ మాట్లాడుతూ.. ఫీజు రియింబర్స్‌మెంట్, ఉపకార వేతన బకాయిలు రూ.7,600 కోట్లు ఉన్నాయన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు ఫీజు రియంబర్స్‌మెంట్, ఉపకార వేతనాలపై ఆధారపడి ఉన్నత చదువులు చదువుతున్నారని.. ఐదేళ్లుగా బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలంటూ విద్యార్థులను వేధింపులకు గురి చేస్తున్నాయని వివరించారు. రూ.1,560 కోట్లు విడుదల చేస్తామని ఇటీవల ప్రకటించిన ప్రభుత్వం ఇంతవరకు పైసా కూడా ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వం పద్ధతినే ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ అనుసరిస్తుందని తెలిపారు. ఇప్పటికైనా స్పందించి బకాయిలు విడుదల చేయకుంటే విద్యార్థులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు అరవింద్, భానుప్రకాష్, చరణ్, గణేష్, జస్వంత్, బన్ని, శివయాదవ్, శివ, భాను పాల్గొన్నారు.

నిబంధనలకు నీళ్లొదిలారా..?

జిల్లాలో సగానికి తగ్గిన మత్స్యబీజం పంపిణీ లక్ష్యం



జిల్లాకేంద్రంలోని నల్లచెరువులో చేపపిల్లలను వదులుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, అధికారులు (ఫైల్)

- టెండర్ ప్రక్రియ ఆలస్యమే కారణమా?
- జిల్లావ్యాప్తంగా 873 చెరువులు.. 1.20 కోట్ల చేప పిల్లల పంపిణీకి ఏర్పాట్లు
- నష్టపోనున్న మత్స్యకారులు

వనపర్తి: మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న ఉచిత చేపపిల్లల పంపిణీలో ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది టెండర్ల ప్రక్రియ ఆలస్యం కావడంతో చేప పిల్లల పంపిణీలో కూడా జాప్యం జరిగింది. దీనికితోడు టెండర్లు దక్కించుకున్న ఆంధ్రా ప్రాంత కాంట్రాక్టర్లు నిబంధనలకు తిలోదకాలిస్తూ దొరికిన సైజుల్లో చేప పిల్లలను తీసుకురాగా.. అధికారులు వచ్చిందే నచ్చిందనే పద్ధతిలో అలాగే చెరువుల్లో వదిలినట్లు చర్చ జరుగుతోంది. గతేడాది చేపపిల్లల పంపిణీ లక్ష్యం 2 కోట్ల పైచిలుకు ఉండగా.. ఈ ఏడాది 1.20 కోట్లకు కుదించారు. దీనికితోడు చేపపిల్లల సైజు ఉండాల్సిన దానికన్నా తక్కువ, ఎక్కువగా ఉండటంతో మత్స్యకారులకు ఎటుచూసినా నష్టం తప్పడం లేదు. రెండు సైజుల్లో ఉన్న మూడు నుంచి నాలుగు రకాల చేప పిల్లలను చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో వదలాల్సి ఉంటుంది. జిల్లావ్యాప్తంగా 1,254 చెరువులు, కుంటలతో పాటు బ్యాలెన్సింగ్, ఇతర రిజర్వాయర్లు ఉండగా.. కేవలం పెద్దసైజ్ చేప పిల్లల (3 నుంచి 3.5 అంగుళాల సైజ్) టెండర్ మాత్రమే ఖరారు కావడంతో కేవలం 879 చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో మాత్రమే వీటిని వదిలేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. చిన్న రకం (1.5 అంగుళాలు) చేప పిల్లల పంపిణీకి టెండర్‌దారులు ఎవరూ ముందుకు రాకపోవడంతో కొన్ని చెరువుల్లో మాత్రమే చేప పిల్లలు వదిలే అవకాశాలు కనిపిస్తున్నాయి.



3.50 అంగుళాల కంటే పెద్ద సైజ్ ఉన్న చేప పిల్లలు

బిల్లు చెల్లింపులు ఇలా..

ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పంపిణీ చేసిన చేప పిల్లల సంఖ్య ఆధారంగా చెల్లింపులు చేస్తారు. పెద్దరకం చేప పిల్లలు ఒక్కింటికి రూ.1.61, చిన్న వాటికి రూ.0.60 ధర చెల్లిస్తారు. డబ్బాతోగాని, కిలో లెక్కనగాని ఒకసారి కొలిచి వాటిని లెక్కిస్తారు. ఈ లెక్కన కాంట్రాక్టర్ ఎన్ని డబ్బాలు, కిలోలు సరఫరా చేస్తే.. అన్నింటిని లెక్కించి బిల్లుల చెల్లింపునకు జిల్లా మత్స్యశాఖ అధికారులు ప్రభుత్వానికి సిఫారస్ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెద్ద రకం చేప పిల్లలు 3 నుంచి 3.5 అంగుళాలు, చిన్న రకం 1.5 అంగుళాల పొడవు మాత్రమే ఉండాలి. పిల్లలు చిన్నగా ఉంటే కౌంటింగ్ ఎక్కువై ఎదుగుదల ఆశాజనకం ఉండకపోవచ్చు. చేప పిల్లల సైజ్ పెద్దగా ఉంటే కౌంటింగ్ తక్కువగా ఉంటుంది. దీంతో చెరువులకు సరిపడా చేప పిల్లలు చేరవు. సైజు పెద్దగా ఉన్నా.. చిన్నగా ఉన్నా మత్స్యకారులకే నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. నిబంధనలు పాటిస్తే పెద్దరకం చేప పిల్లలు కిలోకు 250 నుంచి 350 వరకు ఉండాలి. సైజ్ పెద్దగా ఉంటే కౌంటింగ్ తగ్గుతుంది. చిన్నగా ఉంటే కౌంటింగ్ పెరిగి ఎక్కువ బిల్లు చెల్లించే ఆస్కారం ఉంటుంది. ఈ విషయాన్ని మత్స్యశాఖ అధికారులు గుర్తించి బిడ్డింగ్‌లో పేర్కొన్న విధంగా సైజ్‌లు ఉంటేనే చెరువుల్లో వదిలేందుకు అనుమతించాల్సి ఉంటుంది. ప్రభుత్వం పేర్కొన్న సైజుల్లో సరఫరా చేస్తే అనుకున్న మేరకు ఆయా చెరువులు, రిజర్వాయర్లకు చేప పిల్లలు చేరుతాయి.

25 చెరువులు.. 13 లక్షలు...

జిల్లావ్యాప్తంగా ఉన్న చెరువుల్లో 1.20 కోట్ల చేప పిల్లలు పంపిణీ చేసేందుకు జిల్లా మత్స్యశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే సుమారు 25 చెరువుల్లో 13 లక్షల చేప పిల్లలను వదిలినట్లు తెలుస్తోంది. సైజుల విషయంలో నిబంధనలు పాటించకపోయినా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. మత్స్యకారులకు నష్టం వాటిల్లినా.. ప్రభుత్వం మాత్రం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక తప్పదు.

నిబంధనలు పాటిస్తున్నాం..

కాంట్రాక్టర్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం చేప పిల్లలను సరఫరా చేస్తేనే చెరువులు, రిజర్వాయర్లలో వదులుతున్నాం. వాటిని ప్రజాప్రతినిధులకు చూపించడంతో పాటు స్కేల్‌పై కొలిచిన తర్వాతే చెరువుల్లో వదిలేందుకు అనుమతిస్తున్నాం. మత్స్యకారుల ఎదుట కౌంటింగ్, తూకం చేసి చెరువుల్లోకి తీసుకెళ్తున్నాం. ఈ ప్రక్రియను వీడియోలో రికార్డ్ చేస్తున్నాం.

– లక్ష్మప్ప, జిల్లా మత్స్యశాఖ అధికారి, వనపర్తి

భూ సేకరణ వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి.. సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. గణపసముద్రం రిజర్వాయర్ బ్రాంచ్ కెనాల్‌కు సంబంధించి 197 ఎకరాలు నవంబర్ 20లోపు సర్వే పూర్తి కావాలన్నారు. కర్నె తండా పార్ట్‌లో 171 ఎకరాల సర్వే కూడా వేగంగా చేపట్టాలని సూచించారు. రాజీవ్ భీమా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్, 27 ప్యాకేజీ కింద భూ సేకరణ, అవార్డు జారీ ప్రక్రియ నవంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎం.నగేష్, భూ సేకరణ ప్రత్యేక అధికారి, డిప్యూటీ కలెక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ మధుసూదన్‌రావు, పంచాయతీ ఈఈ మల్లయ్య, ఆర్డీయో పద్మావతి, ఏడీ సర్వే బాలకృష్ణ, డీఈలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి..

బాల్య వివాహాలు అరికట్టేందుకు వారం పొడవునా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. బాల్య వివాహాల నియంత్రణకు మండల, గ్రామస్థాయి కమిటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తహసీల్దార్లు, ఎస్‌ఐలు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని, బాల్య వివాహం జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే తల్లిదండ్రులు, వివాహంలో భాగస్వాములైన అందరిపై కేసులు నమోదు చేయాలని సూచించారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు..

రహదారి భద్రత కమిటీ సమావేశం అనంతరం అక్కడే మాదక ద్రవ్యాల నివారణపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మాదక ద్రవ్యాల తయారీ, వినియోగంపై నిఘా ఉంచాలని పోలీస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీలు ఏర్పాటు చేశామని.. సభ్యులను ఎప్పటికప్పుడు ఉత్తేజపరుస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, ఎం.నగేష్, అడిషనల్ ఎస్పీ తేజావత్ రాందాస్, రోడ్లు, భవనాలశాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ దేశ్యానాయక్, ఆర్డీఓ పద్మావతి, ఆర్టీఏ మానస, జాతీయ రహదారుల అధికారులు, పంచాయతీరాజ్ ఈఈ మల్లయ్య, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మమ్మ, డా. సాయినాథ్‌రెడ్డి, జిల్లాలోని ఎస్‌ఐలు, తహసీల్దార్లు, పుర కమిషనర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు..

జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో రోడ్లు, భవనాలశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని మండలాల స్టేషన్ హౌజ్ ఆఫీసర్లు పాల్గొని తమ పరిధిలో రహదారి ప్రమాదాలు జరిగే స్థలాలు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఒక్కొక్కరు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. వెల్టూర్, పాలెం, మదర్‌థెరిస్సా, అమడబాకుల, నాటవెల్లి, తోమాలపల్లి, ఆనంద్‌భవన్, పెబ్బేరు మోడల్ స్కూల్, రంగాపూర్ కూడళ్లలో సూచిక బోర్డులు, బ్లింకింగ్ లైట్లు, హైమాక్స్ లైట్లు, తెల్లటి రంబల్ స్ట్రిక్స్, వాహనాల పార్కింగ్‌కు స్థలం ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైనా రహదారులు ఆక్రమణకు గురైతే వెంటనే నోటీసులు జారీ చేసి తొలగించాలన్నారు. పురపాలికల్లోని ఆస్పత్రులు, షాపింగ్ కాంప్లెక్స్‌లలో సెల్లార్లు కచ్చితంగా ఉండాలని.. వాటిని వాహనాలు నిలిపేందుకు మాత్రమే వినియోగించేలా చూడాలని సూచించారు. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కేసులు నమోదు చేయాలని పోలీస్, ఆర్టీఏ అధికారులను ఆదేశించారు. కొత్తగా లైసెన్స్ పొందిన వారికి, తీసుకోవాలనుకునే వారిని గుర్తించి ట్రాఫిక్ శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలన్నారు. టోల్‌ఫ్రీ నంబర్ 1033, 108పై అవగాహన కల్పించాలని, రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు తక్షణం చేపట్టాల్సిన చర్యలపై నివేదిక సమర్పించడంతో పాటు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులను ఆదేశించారు.

అమరుల త్యాగాలు వెలకట్టలేనివి



రక్తదానం చేస్తున్న పోలీసు అధికారులు

- ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి రూరల్: సమాజం, దేశం, రేపటి తరాల మంచి భవిష్యత్ కోసం పలువురు పోలీసులు ప్రాణ త్యాగం చేశారని.. వారిని ఎన్నటికీ మర్చిపోలేమని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా బుధవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లాలోని పలువురు పోలీసు అధికారులు, యువకులు, వివిధ సంఘాల నాయకులు 123 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పోలీసు అమరవీరుల త్యాగాలను నిత్యం స్మరించుకోవాలని, వారి త్యాగ ఫలితమే మనమంతా ప్రశాంత జీవనం గడుపుతున్నామని వివరించారు. పేద ప్రజలు, బాధితులకు సత్వర న్యాయం అందించడం, ధర్మం పక్షాన నిలిచి మెరుగైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా పని చేసినప్పుడే వారి త్యాగానికి మనమందించే ఘనమైన నివాళి అన్నారు. అమ్మ జన్మనిస్తే రక్తదానం పునర్జన్మను ఇస్తుందని.. ఒక్క రక్తదానంతోనే ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి ప్రాణదానం చేయడం సాధ్యమవుతుందని తెలిపారు. తలసేమియా, క్యాన్సర్, హిమోఫీలియా, రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి ఇతరత్రా జబ్బులతో బాధపడుతున్న వారికి ఎక్కువగా రక్తం అవసరం ఉంటుందన్నారు. రక్తదానం చేసి వారి ప్రాణాలను కాపాడటం ద్వారా మనకు కూడా మంచి చేకూరుతుందని తెలిపారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి మనిషి ప్రతి 5 నెలలకు ఓసారి రక్తదానం చేయాలని.. దీంతో శరీరం మరింత ఉత్సాహవంతంగా మారుతుందని చెప్పారు. రక్తదానానికి ముందుకొచ్చిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాందాస్ తేజావత్, డీఎస్పీ వెంకటేశ్వరావు, సీఐ కృష్ణ, శివకుమార్, నరేష్, అప్పలనాయుడు, శ్రీనివాస్, ఎస్‌ఐలు, రెడ్‌క్రాస్ సిబ్బంది, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి

వనపర్తి రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి కోరారు. బుధవారం మండలంలోని చిట్యాలలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో ఉమ్మడి జిల్లా మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల క్రీడాపోటీలను జ్యోతి వెలిగించి, జాతీయజెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలకు ఊరికి దూరంగా స్థలం కేటాయిస్తే గ్రామస్తులతో మాట్లాడి ఇక్కడి మార్పించినట్లు గుర్తు చేశారు. ఇక్కడ బోధన, భోజన వసతి, బిల్డింగ్, ఆట స్థలం బాగుండటంతో విద్యార్థులు ఇక్కడికి రావడానికి ఆసక్తి చూపుతారని తెలిపారు. ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలోని 14 మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గురువయ్యగౌడ్, పాఠశాల కమిటీ చైర్మన్ రాజు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు పెద్ద కోటయ్య, సురేశ్‌గౌడ్, దాస రాజు, భాస్కర్, గడ్డం వినోద్, కుమార్‌గౌడ్, హన్మంతు, బాలు తదితరులు పాల్గొన్నారు.

మీరు అక్రమంగా సంపాదించుకుంట లేరా? మాక్కూడా ఇస్తే ఏమవుతుంది? మేం సహకరిస్తాం కదా.. దందా మీకే ఈజీ అవుతుంది. అవసరమైతే రేటు మరింత పెంచండి. ఇళ్లు కట్టుకునే వారు ఎలా అయినా తీసుకుంటరు. మాకు, మా అనుచరులకు ఇవ్వకుంటే మీ దందా నడవదు.

– ఇసుక దందా నిర్వాహకులతో ఓ నియోజకవర్గ ముఖ్యనేత అన్న మాటలివి..

'నాకు షేర్ ఇవ్వాలి.. నా వాళ్లకు సైతం ముట్టజెప్పాలి. లేకుంటే పనులెట్ల ముందుకు సాగుతవో చూస్తా. మీరు సంపాదించుకుంట లేరా. అంతా నాణ్యతతో చేస్తారా.. ఏమిటి ?

– ఓ ఎన్‌హెచ్ కాంట్రాక్టర్‌తో అధికార పార్టీ నాయకుడైన ఓ మాజీ ఎమ్మెల్యే

నాకూ వాటా కావాలి..!



అక్రమార్కులకు ముఖ్యనేతల హుకుం

- చీకటి దందాలే టార్గెట్‌గా అడుగులు
- పెట్టుబడి లేకుండా షేర్ కావాలని ఒత్తిళ్లు
- పలు నియోజకవర్గాల్లో ఇసుక, మట్టి తవ్వకాలకు రేటు ఫిక్స్
- నేరుగా వారి అనుచరులు, అసిస్టెంట్లతోనే కార్యకలాపాలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: నయా పైసా పెట్టుబడి పెట్టకుండా సంపాదించుకునే మార్గాలపై అధికార పార్టీకి చెందిన కొందరు ముఖ్యనేతలు దృష్టి సారించారు. ఇసుక, మట్టి, క్వారీల తవ్వకాలే టార్గెట్‌గా ధనార్జనకు తెరలేపారు. తమకు ప్రత్యేక వాటా ఇవ్వాలని.. లేకుంటే వ్యవహారం నడవదని దందా నిర్వాహకులకు హుకుం జారీ చేశారు. అవసరాల మేరకు పార్టీలకతీతంగా అక్రమార్కులను సైతం తమ మార్గంలోకి తెచ్చుకోవడమే కాకుండా.. వారికి పెద్దపీట వేశారు. వారితో పాటు తమ తమ ముఖ్య అనుచరులు, అసిస్టెంట్లతోనే అవినీతి, అక్రమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పనుల కాంట్రాక్ట్, ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో అయితే ఏమోగానీ.. ఏకంగా చీకటి దందాల్లో వాటా కావాలని అక్రమార్కులను పలు నియోజకవర్గాల ముఖ్యనేతలు డిమాండ్ చేయడం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది.

నెల క్రితమే బీజం..

ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా దేవరకద్ర, నారాయణపేట, మక్తల్, అచ్చంపేట, అలంపూర్ నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో ఇసుకదందా యథేచ్ఛగా సాగుతోంది. ఇటీవల వర్షాల నేపథ్యంలో వాగుల్లో నీరు చేరడంతో తవ్వకాలు కొంత మేర నిలిచినా.. చీకటి వేళ జేసీబీలు, హిటాచీ వంటి భారీ వాహనాలతో బకెట్ల ద్వారా తోడేస్తున్నారు. వాగుల్లో నీరు సమృద్ధిగా చేరక మునుపే పలు నియోజకవర్గాలకు చెందిన ముఖ్యనేతలు వాటా కావాలని ఆయా మండలాల్లో నమ్మినబంట్లుగా పేరొందిన అనుచరుల ద్వారా దందా నిర్వాహకులపై ఒత్తిళ్లు తెచ్చినట్లు తెలిసింది. ఈ మేరకు దందా చేస్తున్న వారిలో 70 శాతానికి పైగా అంగీకారం తెలపగా.. కొందరు ససేమిరా అని మొండికేసినట్లు సమాచారం. దీంతో సదరు ముఖ్య నేతలు పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ద్వారా లొంగని వారి వాహనాలు పట్టుకోవడం, కేసులు నమోదు చేయడంతో చేసేదేమీ లేక అంతా ఒకే చెప్పినట్లు వినికిడి. ఆ తర్వాత కొన్ని చోట్ల ప్రభుత్వ అభివృద్ధి పనులకు అనుమతుల పేరిట.. మరి కొన్ని ప్రాంతాల్లో అనుమతులు తీసుకోకుండా గుట్టుచప్పుడు కాకుండా ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టడం.. వందలాది సంఖ్యలో భారీ వాహనాలతో ఉమ్మడి జిల్లాతోపాటు హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలకు ఇసుక తరలించారు.



నారాయణపేట జిల్లా మాగనూర్ సమీపంలో డంప్ చేసిన ఇసుక

రేట్లు ఫిక్స్ చేసి మరి..

ఒప్పందం కుదిరిన క్రమంలో ఇసుక దందాకు అడ్డులేకుండా పలు నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నేతలు అన్నీ తామై ముందుకు సాగినట్లు తెలుస్తోంది. ఈ మేరకు రేట్లు ఫిక్స్ చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఆయా నియోజకవర్గాల్లో మండలాల వారీగా ఇసుక తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలు.. వాహనాల సంఖ్య ప్రకారం రోజుకు రూ.50 వేల నుంచి రూ.లక్ష తగ్గకుండా ముఖ్య నేతలకు.. మండల లీడర్లకు రోజుకు రూ.5 వేల నుంచి రూ.10 వేలు, సహకరిస్తున్న పోలీస్, రెవెన్యూ సిబ్బందికి ఒక్కో వాహనానికి రూ.2 వేలు, నెలకు అదనంగా రూ.5 వేల నుంచి రూ.10 వేల చొప్పున ముట్టజెప్పేలా ఫిక్స్ చేసి వసూళ్లు చేసినట్లు సమాచారం.

ఇప్పుడు కూడానా..

ప్రస్తుతం వాగుల్లో నీరు సమృద్ధిగా ఉండడంతో ఇసుక తవ్వకాలకు పెద్దగా ఆస్కారం లేకుండా పోయింది. ఈ క్రమంలో అక్రమార్కులు వాగుల సరిహద్దుల్లో రాత్రిళ్లు దొంగచాటుగా జేసీబీ, హిటాచీ వంటి వాహనాలతో బకెట్ల ద్వారా ఇసుక తోడుతూ టిప్పర్లు, బెంజ్‌ల ద్వారా పలు ప్రాంతాలకు తరలిస్తున్నారు. వీటిపైనా నిఘా పెట్టిన ఆయా నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నాయకులు తమకు వాటా ఇవ్వకుండా.. తవ్వుతుండడంపై సీరియస్ అయినట్లు సమాచారం. తమకు వాటా ముట్టజెప్పాల్సిందేనని.. అవసరమైతే రేటు పెంచండి అంటూ వారు సలహా ఇచ్చినట్లు తెలిసింది. వాగుల్లో నీరు చేరకముందు అయితే ఒకే.. కానీ ఇప్పుడు కూడా అడగడం ఏమిటని దందా నిర్వాహకులు నోరెళ్లబెట్టినట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. కాగా, నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నేతలే చీకటి దందాలకు సహకరించేలా పురిగొల్పుతుండడంపై ఆయా ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

రెండు బైక్‌లు ఢీ: ఒకరి దుర్మరణం

కోస్గి: ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన గుండుమాల్ మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గుండుమాల్‌కు చెందిన కస్తూరి కృష్ణ (38) గ్రామంలోనే బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఓ బైక్‌ను రిపేర్ చేసి, యజమాని సూచన మేరకు పెట్రోల్ పోయించేందుకు బంక్‌కు వెళ్లి వస్తుండగా.. మద్దూర్ మండలం దోరేపల్లికి చెందిన మోహన్ కోస్గి నుంచి స్వగ్రామానికి వెళ్తూ.. గుండుమాల్ చెరువు కట్టపై ఎదురెదురుగా ఢీకొన్నారు. దీంతో మెకానిక్ కృష్ణ తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య మానసతో పాటు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని.. వ్యక్తి బలవన్మరణం

మద్దూరు: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన కొత్తపల్లి మండలం ఎక్కమేడ్‌లో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాంలాల్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన హరిజన్ చంద్రప్ప (40) తాగుడుకు బానిసై ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాడు. నెల క్రితం భార్య రాములమ్మతో గొడవ పడటంతో ఆమె కూతుర్ని తీసుకొని తల్లిగారింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురై మంగళవారం రాత్రి మద్యం మత్తులో ఊయల కొండికి చీరతో ఉరేసుకొని మృతిచెందాడు. ఉదయం చుట్టుపక్కల వారు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఖిల్లాఘనపురం: మండలంలోని వెంకటాంపల్లికి చెందిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్‌ఐ సురేశ్‌గౌడ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన మోళ్ల మొళ్ల లక్ష్మణ్ (32) మతిస్థిమితం కోల్పోయాడు. ఈ నెల 1న గ్రామంలోని శివని చుక్కన్న పాత ఇంటి పైనుంచి మెట్ల మార్గంలో దిగుతుండగా ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. తలకు గాయం కావడంతో వెంటనే చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి అటు నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం ఆయన మృతిచెందాడు. తల్లి నారమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

కోడి పందెల స్థావరాలపై పోలీసుల దాడులు



కొడేరు: మండలంలోని బాడుగదిన్నె గ్రామ సమీపంలో వ్యవసాయ పొలం దగ్గర కొందరు కోడి పందెలు ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్‌ఐ గోకారి ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఈ క్రమంలో అక్కడ ఉన్న 20 ద్విచక్రవాహనాలు, 12 కోడి పుంజులను పోలీసులు స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ గోకారి మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా కోడిపందెలు, పేకాట ఆడినట్లు సమాచారం వస్తే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పందెలు ఆడిన వారు పరారీలో ఉన్నారని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

మ్యాజిక్ ఫౌండేషన్‌తో డిగ్రీ కళాశాల ఒప్పందం



జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలోని టీఎస్‌కేసీ టాస్క్ – మ్యాజిక్ బస్ ఫౌండేషన్‌ల మధ్య బుధవారం అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డా. సుకన్య, ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ చందర్‌లు ఒప్పంద పత్రంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. అవగాహన ఒప్పందంతో విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, ఎంప్లాయిబిలిటీ స్కిల్స్‌లపై శిక్షణ లభిస్తుందన్నారు. అవగాహన ఒప్పందం రెండేళ్లపాటు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డా.నాగలక్ష్మి, అకడామిక్ కోఆర్డినేటర్ డా. శ్రీనివాసులు, మెంటర్ వీరప్రతాప్, మ్యాజిక్ బస్ ప్రతినిధి ఫయాజ్ పాల్గొన్నారు.

అనర్హుల గుండెల్లో 'డబుల్' దడ



దివిటిపల్లిలో విచారణ చేస్తున్న రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల అధికారులు



షహీదా బేగానికి ఇంటి పట్టా అందజేస్తున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

- ఇళ్ల కేటాయింపుపై విచారణకు కలెక్టర్ ఆదేశం
- రంగంలోకి ప్రత్యేక బృందం
- లబ్ధిదారుల స్థితిగతులపై ఆరా
- వెలుగులోకి వస్తున్న అక్రమాలు

మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలో డబుల్‌బెడ్రూం ఇళ్ల కేటాయింపుపై చేపట్టిన విచారణ పక్కాగా కొనసాగుతోంది. ఇళ్ల కేటాయింపులో అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకున్నాయని.. అనర్హులకు కేటాయింపు చేశారన్న ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో కలెక్టర్ సమగ్ర విచారణకు ఆదేశించిన విషయం విదితమే. కలెక్టర్ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల అధికారులు బుధవారం దివిటిపల్లిలో డబుల్‌బెడ్రూం ఇళ్లను సందర్శించి, విచారణ చేపట్టారు. లబ్ధిదారుల అర్హతపై ఇంటింటి సర్వే నిర్వహించారు. విచారణ ప్రక్రియను రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు, గృహ నిర్మాణ శాఖ పీడీ వైద్యం భాస్కర్ పర్యవేక్షించారు. ప్రభుత్వం పేదలకు కేటాయించిన డబుల్‌బెడ్రూం ఇళ్లు ప్రభుత్వ ఆస్తి అని.. వారసత్వంగా అనుభవించవచ్చని.. కానీ లబ్ధిదారులు వేరే వాళ్లకు అమ్మినా, కొనుగోలు చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, ఉన్నత శ్రేణి వర్గాలు డబుల్‌బెడ్రూం ఇళ్లు పొందితే స్వచ్ఛందంగా స్వాధీనం చేయాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పారదర్శకంగా విచారణ..

డబుల్‌బెడ్రూం ఇళ్ల కేటాయింపులో అనర్హులను గుర్తించి, వారి నుంచి ఇళ్లను తిరిగి ప్రభుత్వానికి స్వాధీనం చేసేందుకు కసరత్తు చేపట్టారు. ఇళ్లు లేని పేదలకు ఇవ్వాల్సిన డబుల్‌బెడ్రూం ఇళ్లను ఆర్థికంగా ఉన్న వారికి, ప్రభుత్వ ఉద్యోగులు, గత ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధుల బినామీల పేరిట కేటాయించడంతో నిజమైన లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది. డబుల్‌బెడ్రూం ఇళ్ల అక్రమాలపై కలెక్టర్‌కు అనేక ఫిర్యాదులు అందాయి. స్పందించిన కలెక్టర్.. సమగ్ర విచారణకు ఆదేశించారు. ఈ మేరకు దివిటిపల్లిలో అధికారులు పర్యటించి లబ్ధిదారుల ఆర్థిక స్థితిగతులపై విచారణ చేపట్టారు.

అర్హురాలికి ఇంటి పట్టా..

దివిటిపల్లిలో లబ్ధిదారు షహీదా బేగానికి గత ప్రభుత్వంలో డబుల్‌బెడ్రూం ఇల్లు కేటాయించారు. ఆమె కుమారుడు మానసిక దివ్యాంగుడు. కుమారుడి చికిత్స కోసం నిలోఫర్ ఆస్పత్రికి తిరుగుతున్న సమయంలో తాళం పగులగొట్టి వేరే కుటుంబం నకిలీ పత్రాలతో స్వాధీనం చేసుకున్నారు. బాధితురాలు ఇంటికి వెళ్తే బెదిరించి పోలీసు కేసు పెట్టారు. ఆన్‌లైన్‌లో మాత్రం షహీదాబేగం పేరు ఉంది. తనకు న్యాయం చేయాలని షహీదా బేగం ఏడాదిగా అర్బన్ తహసీల్దార్ కార్యాలయానికి తిరుగుతున్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో సైతం ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు విచారించి, తిరిగి బాధితురాలికి డబుల్‌బెడ్రూం ఇంటి పట్టాను రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు సమక్షంలో అందజేశారు. తనకు న్యాయం జరగడంతో కలెక్టర్, అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు ప్రత్యేక చొరవతో అర్హులకు ఇళ్లు దక్కేలా చేస్తుండటంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

అన్నదాన సత్రం దేవస్థానానికి అప్పగింత



ఆలయ ఈఓ పురేందర్‌కు రికార్డులు అప్పగిస్తున్న టూరిజంశాఖ డీఈ పరుశవేది

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్‌లో కేంద్ర ప్రభుత్వం రూ.36 కోట్లతో నిర్మించిన ప్రసాద్‌స్కీం భవనంలోని అన్నదాన సత్రం పత్రాలను బుధవారం టూరిజంశాఖ డీఈ పరుశవేది ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డికి అందజేశారు. కార్తీక మాసం మొదటి వారంలో వాస్తుపూజ, హోమం నిర్వహించి అన్నదానం ప్రారంభిస్తామని ఈఓ వివరించారు. కార్యక్రమంలో ఏఈ మధుసూదన్‌రెడ్డి, ధర్మకర్త జగదీశ్వర్‌గౌడ్, ఏజీఎం రమేష్‌నాయక్, అసిస్టెంట్ మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యానికి కపిలవాయి ఎనలేని సేవలు



మాట్లాడుతున్న కళాశాల విద్య జాయింట్ డైరెక్టర్ యాదగిరి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: కపిలవాయి లింగమూర్తి తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవ చేశారని తెలంగాణ కళాశాల విద్యా జాయింట్ డైరెక్టర్ యాదగిరి అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో 'కపిలవాయి లింగమూర్తి సాహిత్యానుశీలనం' అంశంపై జాతీయ సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యాదగిరి మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని భవిష్యత్ తరాలకు అందించాలంటే తప్పకుండా మరిన్ని పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు రీసెర్చి స్కాలర్స్ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు వివిధ యూనివర్సిటీల నుంచి పేపర్ ప్రజెంటేషన్‌కు రీసెర్చి స్కాలర్స్ హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంధ్యారాణి, కపిలవాయి అశోక్‌బాబు, మనోహర్‌రెడ్డి, బుర్రి రామారెడ్డి, ప్రిన్సిపాల్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు భారీ బందోబస్తు: ఎస్పీ



కురుమూర్తి స్వామి ఆలయం వద్ద పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ జానకి

చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి ఉత్సవాలకు భారీ బందోబస్తుతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తామని ఎస్పీ జానకి అన్నారు. కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని బుధవారం ఆలయం వద్ద జాతర మైదానం, కోనేరు తదితర పరిసరాలను పరిశీలించారు. అంతకు ముందు పల్లిమరిలో చాట తయారీమండపం, చిన్నవడ్డెమాన్ గ్రామంలో ఉద్దాల తయారీ మండపం, అమ్మాపురం గ్రామంలో సంస్థానాధీశులు శ్రీరాంభూపాల్ నివాసాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కురుమూర్తిస్వామి ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు ఉంటాయన్నారు. అందుకు అనుగుణంగా పోలీస్ సిబ్బందిని నియమించేలా చర్యలు చేపడుతామన్నారు. ఆమె వెంట డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రామకృష్ణ, పాలక మండలి సభ్యులు గోవర్ధన్‌రెడ్డి, భాస్కరాచారి ఉన్నారు.

జూరాలకు 36 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు/ ఆత్మకూర్/ దోమలపెంట: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టిందని అధికారులు తెలిపారు. బుధవారం ప్రాజెక్టుకు ఎగువ నుంచి 36 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. విద్యుదుత్పత్తి నిమిత్తం 37,297 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, ఎడమ కాల్వకు 1,140, కుడి కాల్వకు 715, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు వదలగా.. మరో 47 క్యూసెక్కులు ఆవిరైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.730 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి వేగవంతంగా కొనసాగుతుంది. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 196 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు కలిపి మొత్తం 283.310 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేపట్టామని ఎస్ఈ సూరిబాబు తెలిపారు.

శ్రీశైలం గేట్ల మూసివేత

జూరాల నుంచి వస్తున్న నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో శ్రీశైలం ఆనకట్ట వద్ద రెండు గేట్లను బుధవారం మూసివేశారు. ప్రస్తుతం జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,343 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 1,05,547 మొత్తం 1,42,518 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలానికి వస్తుంది. దీంతో భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,253 మొత్తం 65,568 క్యూసెక్కుల నీటిని దిగువన నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. అలాగే గత 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 17,333 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,554, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకి 1,352 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. శ్రీశైలం జలాశయంలో 884.5 అడుగుల వద్ద 212.9198 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

కొత్త ఉల్లి రాకతో తగ్గిన ధరలు



దేవరకద్ర: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మూడు వారాలుగా కొత్త ఉల్లి అమ్మకానికి వస్తుండటంతో ధరలు పడిపోయాయి. పాత ఉల్లి ధరలు సామాన్యుడికి చుక్కలు చూపించగా.. కొత్త ఉల్లి రాకతో ఉపశమనం లభించింది. గతనెల వరకు పాత ఉల్లి ధర రూ. 6 వేల వరకు పలకగా.. కొత్త ఉల్లి ధరలు సగానికి సగం తగ్గాయి. బుధవారం క్వింటాల్ ఉల్లి గరిష్టంగా రూ. 3,100, కనిష్టంగా రూ. 1,021, సగటున రూ. 2,510 ధరలు పలికాయి. మార్కెట్‌కు పెద్దఎత్తున అమ్మకానికి వచ్చిన ఉల్లిని వ్యాపారులు పోటీపడి కోనుగోలు చేశారు. దాదాపు 500 బస్తాల ఉల్లి అమ్మకానికి వచ్చింది. తూకం తర్వాత 45 కేజీల బస్తాను గరిష్టంగా రూ. 1,600, కనిష్టంగా రూ. 550, సగటున రూ. 1,300 వరకు అమ్మకాలు సాగించారు.

సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు

జడ్చర్ల: పట్టణంలోని శ్రీరాంనగర్ ఐటీసీ గోదాంలో ఈ నెల 20న సుమారు రూ.32 లక్షల సిగరెట్ కాటన్ల అపహరణ కేసు దర్యాప్తు చురుగ్గా సాగుతున్నట్లు తెలిసింది. ప్రధానంగా సిగరెట్ల అపహరణ చోరీకి సంబంధించి సీసీ పుటేజీలు ప్రధాన ఆధారంగా మారాయి. సీసీ పుటేజీల్లో షోరూం నుంచి కొత్తగా కొనుగోలు చేసిన బొలెరో వాహనంలో సిగరెట్ కాటన్లను తరలిస్తున్నట్లు స్పష్టంగా కనిపించడంతో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు ప్రారంభించారు. సిగరెట్ కాటన్లతో జడ్చర్ల నుంచి బయలుదేరిన వాహనం మహబూబ్‌నగర్ అటు నుంచి హైదరాబాద్‌కు వెళ్లినట్లు గుర్తించారు. తర్వాత హైదరాబాద్‌లో కాటన్లను అన్‌లోడ్ చేసిన దొంగలు ఖాళీ వాహనంతో కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూర్‌కు వెళ్లినట్లుగా గుర్తించారు. అయితే ముందుగా వాహనం కొనుగోలు చేసిన షోరూంను గుర్తించి ఇందుకు గ్యారంటీ ఇచ్చిన వ్యక్తి ద్వారా నిందితుల ఫోన్ నంబర్లను తీసుకుని విచారించినట్లు సమాచారం. నిందితుల ఫోన్‌లను కాల్ ట్రాకింగ్ చేసిన పోలీసులకు ఏపీలోని హిందుపూర్ దాబాలో ఉన్నట్లు గుర్తించి వారిని ఫోన్ ట్రాకింగ్‌లో అనుసరించారు. వీరిలో ఒక దొంగ బస్సులో హైదరాబాద్ వెళ్తుండగా జడ్చర్ల సమీపంలో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అతని ద్వారా మిగతా దొంగలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

జేబుదొంగల చేతివాటం

- రూ.లక్ష వరకు మాయం చేసిన వైనం

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాకేంద్రంలో బుధవారం జరిగిన ముడా చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో జేబుదొంగలు తమ చేతివాటం ప్రదర్శించారు. జేజేఆర్ గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు హాజరుకాగా ద్వితీయశ్రేణి నాయకులు వారి చుట్టూ చేరుకోవడంతో హడావుడి నెలకొంది. ఇదే అదనుగా భావించిన దొంగలు రూ.లక్ష వరకు మాయం చేశారు. కోడూర్‌కు చెందిన ఓ వ్యక్తి బైక్ కొనుగోలు చేసేందుకు రూ.లక్ష తీసుకొచ్చారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం ముగిసిన అనంతరం తీసుకుందామని భావించి జేబులో నగదు ఉంచుకొని అక్కడికి వెళ్లారు. అందులో నుంచి రూ.50 వేలు మాయం చేశారు. మరో వ్యక్తి జేబులో నుంచి రూ.20 వేలు, ఇంకో వ్యక్తి నుంచి రూ.6 వేలు, ఇలా పలువురి జేబుల్లో నుంచి సుమారు రూ.లక్ష మాయం చేశారు. ఇటీవల నవాబ్‌పేటలో జరిగిన పదవీ ప్రమాణ స్వీకారోత్సవంలోనూ రాజాపూర్‌కు చెందిన వ్యక్తి జేబులో నుంచి భారీగా డబ్బు మాయం చేశారు. ఇలాంటి ముఠాలు రాజకీయ సమావేశాలు లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్నట్లు సమాచారం.

కృత్రిమ కల్లు అమ్మకాలపై ఆందోళన

అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేటలో కల్లు దుకాణం వద్ద బుధవారం రాత్రి గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. గ్రామ సమీపంలోని చెట్ల నుంచి వచ్చే కల్లును అక్కడే విక్రయిస్తూ.. స్థానిక కల్లు దుకాణంలో కృత్రిమ కల్లు విక్రయిస్తున్నారని ఆరోపించారు. మరోవైపు కల్లు ధరను పెంచడాన్ని గ్రామస్తులు వ్యతిరేకించారు. ఈ విషయంపై కల్లు దుకాణం నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో గ్రామస్తులు కల్లు దుకాణాన్ని మూయించారు. చెట్ల నుంచి తెచ్చే కల్లును దుకాణంలోనే విక్రయించాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని గ్రామస్తులను సముదాయించారు. కల్లు దుకాణం వద్ద ఆందోళన చేపట్టిన గ్రామస్తులను పోలీసులు అక్కడి నుంచి పంపించి వేశారు.

ఓ తండ్రి వినూత్న నిరసన



జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన బ్యానర్

కృష్ణా: భర్త, అత్త, ఆడపడుచుల వేధింపులు భరించలేక తన కుమార్తె జయలక్ష్మి ఏడాది కిందట ఆత్మహత్య చేసుకుందని.. వారు గ్రామం విడిచి పారిపోయారని, ఆచూకీ తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలంటూ మండలంలోని గుడెబల్లూర్‌కు చెందిన చన్నప్పగౌడ గ్రామ రహదారిపై బ్యానర్ ఏర్పాటు చేశారు. బుధవారం గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. తన కుమార్తె జయలక్ష్మిని కర్ణాటకలోని సేడం తాలూకా శంకర్‌పల్లికి చెందిన శంకరరెడ్డికి ఇచ్చి మూడేళ్ల కిందట వివాహం జరిపించానన్నారు. కొన్నిరోజులు బాగానే ఉన్నా తర్వాత వరకట్నం కోసం భర్త, అత్త సావిత్రమ్మ, ఆడపడుచులు పుష్ప, లక్ష్మి వేధించడంతో ఆత్మహత్య చేసుకుందని చెప్పారు. కర్ణాటక పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెళ్తే పట్టించుకోవడం లేదని.. నిందితులు రాజకీయ పలుకుబడితో పాల్పడుతున్నారని ఆరోపించారు. తనకు మనవరాలిని అప్పగించడంతో పాటు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న విద్యార్థులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ సత్యం, అధికారులు

కల్వకుర్తి టౌన్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మున్సిపల్ చైర్మన్ సత్యం అన్నారు. పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల మైదానంలో బుధవారం ఉమ్మడి జిల్లాస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో భవిష్యత్‌కు మంచి భరోసా ఉంటుందన్నారు. చిన్నతనం నుంచే పోటీల్లో పాల్గొనడం వల్ల రానున్న రోజులలో గెలుపోటములను ఎదుర్కొనవచ్చన్నారు. ఆసక్తి గల క్రీడలో రాణించేందుకు నిత్యసాధన చేయాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఆయా జిల్లాల విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. మూడు రోజులపాటు పోటీలు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా బీసీ గురుకులాల అధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఖాజీనదీం అలీ, కల్వకుర్తి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా ఎండీసీఏ అండర్–23 టోర్నీ

- గద్వాల–నాగర్‌కర్నూల్ మ్యాచ్ టై



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మనోహర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రం పిల్లలమర్రి రోడ్డులోని క్రికెట్ మైదానంలో ఎండీసీఏ ఉమ్మడి జిల్లా అండర్–23 లీగ్ కమ్ నాకౌట్ టోర్నమెంట్ ఉత్కంఠంగా కొనసాగుతోంది. బుధవారం గద్వాల–నాగర్‌కర్నూల్ జట్ల మధ్య మ్యాచ్ చివరివరకు నువ్వానేనా అనే తరహాలో సాగింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన నాగర్‌కర్నూల్ జట్టు 45.4 ఓవర్లలో 216 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో తరుణ్ (72), వంశీ (30) పరుగులు చేశారు. గద్వాల బౌలర్లు రాంచరణ్ 3, భాస్కర్ 2, డేవిడ్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గద్వాల జట్టు 42.5 ఓవర్లలో 216 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో రాంచరణ్ 77, డేవిడ్ 66 పరుగులు చేశారు. నాగర్‌కర్నూల్ బౌలర్లు సాయిరాం 4, అభినవ్ తేజ 2, జస్వంత్ 2 వికెట్లు తీశారు. గురువారం నారాయణపేట–కొడంగల్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది.

ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎదగాలి

ఉమ్మడి జిల్లా క్రీడాకారులు క్రికెట్‌లో ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎదగాలని మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్, ప్రముఖ న్యాయవాది వి.మనోహర్‌రెడ్డి అన్నారు. గద్వాల–నాగర్‌కర్నూల్ జట్ల క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను అభినందించి మాట్లాడుతూ ఇలాంటి టోర్నమెంట్‌లను క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని తమ క్రీడానైపుణ్యాన్ని చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎండీసీఏ ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, వెంకటరామారావు, కోచ్ అబ్దుల్లా, అంపైర్లు మాజిద్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

29న ఉమ్మడి జిల్లా వుషు ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని స్టేడియంలో ఈనెల 29వ తేదీన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–14, అండర్–17 విభాగాల బాలబాలికల వుషు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో పాల్గొనేవారు పాఠశాల బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో, ఇంటర్ విద్యార్థులైతే తప్పనిసరిగా పదోతరగతి ఒరిజనల్ మెమోతో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని ఆమె కోరారు.

పీయూలో బాస్కెట్‌బాల్ క్రీడాకారుల ఎంపికలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో బుధవారం సౌత్ జోన్, ఆలిండియా బాస్కెట్‌బాల్ జట్టు క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలకు చెందిన 12 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు పీడీ శ్రీనివాస్ తెలిపారు. వీరు త్వరలో బెంగళూరులోని క్రిష్టియాన కళాశాలలో నిర్వహించే పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఎంపికల్లో పీడీ సత్యభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న కంటైనర్ బోల్తా



రోడ్డుపై పడిన మద్యం సీసాలు

జడ్చర్ల: మద్యం తరలిస్తున్న ఓ కంటైనర్ జడ్చర్ల కొత్త బస్టాండ్ సమీపంలో బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు బోల్తా పడింది. పెబ్బేరు నుంచి హైదరాబాద్‌కు మద్యం కాటన్ల లోడ్‌తో వెళ్తుండగా జడ్చర్ల సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై సర్వీస్ రోడ్‌లో ముందు ఆగి ఉన్న లారీలను ఢీకొట్టింది. దీంతో ముందు నిలిపిన మూడు లారీలు ఒకదాని తర్వాత ఒకటి స్వల్పంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కంటైనర్ బోల్తా పడటంతో అందులో తరలిస్తున్న మద్యం సీసాలు బయట పడడంతో స్థానికులు తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

సాక్షి క్లాసిఫైడ్స్
WANTED
■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ: 18K. Ph: 9640258899, 9640468899
సాక్షి ద్వారా మీ ఇష్టులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయండి
కేవలం రూ. 500/-
HAPPY BIRTHDAY
గమనిక
- సాక్షి మేనేజర్